సాక్షి నిర్మల్

ఆదివారం । 29 । సెప్టెంబర్ । 2024



లాఠీ ఎత్తారు.. 8లో▸

ఠాణాలోనే ఇరువర్గాలు ఒకరిపైనొకరు దాడి చేసుకున్నారు. దీంతో పోలీసులు అప్రమత్తమై లాఠీ ఝుళిపించారు. మరోవైపు రెండు వర్గాల ఆధిపత్య దాడులు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి.



ఆంగ్లం.. అనర్గళంగా.. 9లో▸

ఉపాధ్యాయులకు ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధనకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో విద్యాశాఖ శిక్షణ ఇస్తోంది. భాషా నైపుణ్యం పెంపొందించేలా చర్యలు తీసుకుంటోంది.

వాతావరణం

గరిష్టం/కనిష్టం 32.0 /25.1

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

లోక్ అదాలత్‌లతో కేసుల సత్వర పరిష్కారం



కక్షిదారుకు రాజీపత్రం అందజేస్తున్న న్యాయమూర్తి

నిర్మల్ టౌన్: లోక్ అదాలత్‌లతో కేసులు సత్వరం పరిష్కారం అవుతాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి కర్ణకుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన కోర్టులో శనివారం జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ.. లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకుంటే సమయం, డబ్బు ఆదా అవుతాయని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న భూవివాదాలు, రాజీపడే క్రిమినల్ కేసులు, బ్యాంకు సంబంధిత కేసులను సామరస్యంగా పరిష్కరించుకునే వీలుంటుందన్నారు. లోక్ అదాలత్‌లో 10 సివిల్ కేసులు, ప్రీ లిటిగేషన్, బ్యాంకు సంబంధించిన కేసులు 95, క్రిమినల్ కేసులు 2,140, సైబర్ క్రైమ్ 14 కేసులు పరిష్కరించినట్లు వివరించారు. బ్యాంకు బకాయిలు రూ.86,04,618 వసూలు చేసినట్లు పేర్కొన్నారు. డీఎస్పీ గంగారెడ్డి, పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

వారానికోరోజు వృద్ధులకు వైద్యం

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలోని అన్ని ఆరోగ్య కేంద్రాలలో ప్రతీ గురువారం వృద్ధులకు ప్రత్యేక వైద్య సేవలు అందిస్తామని డీఎంహెచ్‌వో డాక్టర్ రాజేందర్ అన్నారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం పురస్కరించుకుని సాగర్ కాలనీలోని వృద్ధాశ్రమంలో వైద్యశాఖ ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ వయో వృద్ధులకు అవసరమైన అన్నిరకాలైన ఆరోగ్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. వృద్ధులతో స్నేహపూర్వకంగా మెలుగుతూ, వారి మాటలను గౌరవిస్తూ, వారి ఆందోళనలు అర్థం చేసుకుని వ్యవహరించాలన్నారు. ప్రతీ గురువారం అందించే ప్రత్యేక సేవలు వృద్ధులందరూ వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమం నిర్వహణ అధికారి డాక్టర్ శ్రీనివాస్, వైద్యాధికారి డాక్టర్ శగుప్త, పాలియేటివ్‌కేర్ సిబ్బంది పాల్గొన్నారు.

పది వేల సీడ్ బాల్స్ తయారీ



విద్యార్థులతో కలిసి సీడ్‌బాల్స్ తయారు చేస్తున్న సభ్యులు

ఖానాపూర్: పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో వాసవీవనిత క్లబ్‌తోపాటు, వాసవిక్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి శనివారం 10,900 సీడ్‌బాల్స్‌ను తయారు చేశారు. భవిష్యత్తు తరాలకు పచ్చనైన, దట్టమైన అడవులను అందించడంలో భాగంగా వాసవీక్లబ్ పిలుపు మేరకు పలురకాల విత్తనాలతో సీడ్ బాల్స్ తయారు చేస్తున్నట్లు సభ్యులు తెలిపారు. కోటి సీడ్‌బాల్స్ చేయడమే క్లబ్ లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జితేందర్, మానస, స్రవంతి, వరలక్ష్మి, శ్వేత, రాధిక, సరిత, చంద్రశేఖర్, రవీందర్, సంతోష్, ప్రభాకర్ పాల్గొన్నారు.

నేడు జాతీయస్థాయి కరాటే పోటీలు



మాట్లాడుతున్న టోర్నమెంట్ చీఫ్ జడ్జి రాపోలు సుదర్శన్

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని, తిరుమల గార్డెన్స్‌లో ఆదివారం చుక్క ధర్మరాజ్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జాతీయస్థాయి కరాటే పోటీలు నిర్వహిస్తున్నట్లు టోర్నమెంట్ చీఫ్ జడ్జి రాపోలు సుదర్శన్ తెలిపారు. ఈ పోటీలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రతోపాటు ఇతర రాష్ట్రాల క్రీడాకారులు హాజరవుతారని తెలిపారు. దాదాపు 1,200 మంది పోటీల్లో తలపడతారని పేర్కొన్నారు. సినీ నటుడు సుమన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై పోటీలను ప్రారంభిస్తారని తెలిపారు. సమావేశంలో కరాటే అసోసియేషన్ తేజేందర్‌సింగ్, కొండాజి శ్రీకాంత్, భూషణ్, స్వామి, సాయికృష్ణ, మృణాళిని తదితరులు పాల్గొన్నారు.

సమయం దాటినా..



జిల్లాకేంద్రంలోని నాయుడివాడ ప్రాథమిక పాఠశాలలో 30 మంది విద్యార్థులు ఉండగా, ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. శనివారం ఉదయం 9.30 గంటలు దాటినా ఉపాధ్యాయులు బడికి రాలేదు. అప్పటికే స్కూల్‌కు వచ్చిన పిల్ల లు బయట ఆడుతూ కనిపించారు.

పాఠశాల తెరువలే..

జిల్లా కేంద్రంలోని గొల్లపేట(శాస్త్రీనగర్) ప్రాథమిక పాఠశాలలో 20 మంది విద్యార్థులు ఉన్నారు. శనివారం ఉదయం 9 గంటలు దాటినా బడి తెరుచుకోలేదు. వచ్చిన విద్యార్థులు ఆరుబయటనే కూర్చున్నారు. ఇక్కడున్న ఉపాధ్యాయురాలిని డిప్యూటేషన్‌పై పంపినట్లు తెలిసింది.



ఆలస్యంగానే..



సోన్ మండలం న్యూబొప్పారం బడిలో 37 మంది విద్యార్థులు ఉండగా శనివారం ఉదయం 9 వరకు 15 మంది పిల్లలు వచ్చారు. ప్రధానోపాధ్యాయురాలు ఒక్కరే సమయానికి హాజరయ్యారు. ఒక టీచర్ లీవ్ పెట్టగా, మరొకరు 9.25 వరకు పాఠశాలకు వచ్చారు. ఇక తరగతి గదులను విద్యార్థులే శుభ్రం చేస్తూ కనిపించారు.

సార్లు.. సమయానికి రాలే!

- డీఈవో ఆదేశాలు పాటించింది కొందరే
- అరగంట ఆలస్యంగా చాలా మంది టీచర్లు
- పాఠశాలలను తెరిచింది విద్యార్థులే..
- సెల్‌ఫోన్లలోనే సెలవు కబుర్లు
- లైవ్‌లొకేషన్‌లో లీలలెన్నో..!



దస్తురాబాద్ మండలం మున్యాల్ జిల్లాపరిషత్ సెకండరీ పాఠశాలలో 12 మంది ఉపాధ్యాయులు ఉండగా, 11 మంది సమయపాలన పాటించారు. ఒకరు లీవ్‌లో ఉన్నారు. విద్యార్థులు సైతం సమయానికి రావడంతో 9.05 గంటలకు ప్రార్థన చేశారు. లైవ్‌లొకేషన్ పెట్టడంతోపాటు ప్రార్థన ఫొటోలు తీసుకున్నారు.

నిర్మల్: జిల్లాలో యాబిట్ దందా నుంచి విద్యాశాఖ బయటపడటానికి ఇంకా సమయం పట్టేలా ఉంది. ఈ చైన్‌లింక్ దందాతో గాడితప్పిన జిల్లా విద్యాశాఖపై 'సాక్షి' వరుస కథనాలు ప్రచురించడంతో జిల్లా అధికారులు స్పందించారు. పాఠశాలల్లో శనివారం నుంచి కఠినచర్యలు తీసుకుంటామని ప్రకటించారు. ఈనేపథ్యంలో జిల్లాలోని వివిధ మండలాల్లో పలు ప్రభుత్వ బడులను 'సాక్షి' ఉదయం 9 గంటలకు విజిట్ చేసింది. చాలా పాఠశాలలు, ఉపాధ్యాయులు ఇంకా గాడిన పడలేదన్న విషయం స్పష్టమైంది. ఉదయం 9 గంటలకే బడిలో ఉండాల్సిన టీచర్లు చాలాచోట్ల అరగంటకుపైగా ఆలస్యంగా రావడం కనిపించింది. కొన్నిచోట్ల బడులే తెరుచుకోలేదు. సార్లకంటే పిల్లలే ముందుగా వచ్చి ఆరుబయట ఆడుకున్నారు.

మారని తీరు..

ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు సమయానికి బడికి రావడంతోపాటు తాము హాజరైనట్లు లైవ్‌లొకేషన్ పెట్టాల్సి ఉంటుంది. సకాలంలో ప్రార్థన చేయించడంతోపాటు సదరు ఉపాధ్యాయులంతా హాజరైన ఫొటోలను జిల్లా అధికారుల గ్రూపులలో పోస్టు చేయాలి. ఇంత కఠినంగా నిబంధనలు ఉన్నా.. చాలామంది ఉపాధ్యాయుల తీరు మాత్రం మారడం లేదు. ఇక నుంచి పద్ధతి మార్చుకోవాలని, నిబంధనలను పక్కాగా పాటించాలని విద్యాశాఖాధికారి రవీందర్‌రెడ్డి ఆదేశించిన రోజే చాలామంది నిర్లక్ష్యంగా వ్యవహరించడం కనిపించింది. కొంతమంది స్కూల్‌కు రాకుండా సెల్‌ఫోన్లలోనే హెడ్ మాస్టర్లకు లీవ్ తీసుకుంటున్నట్లు చెప్పడం గమనార్హం.

- కడెం మండలం పెద్దూరు ప్రాథమిక పాఠశాలలో 22 మంది వరకు విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ ఒక ఉపాధ్యాయుడు ఉండగా, శనివారం ఉదయం 9.30 గంటలు దాటినా రాలేదు.
- కుంటాల ఉన్నతపాఠశాలలో 13 మంది ఉపాధ్యాయులు ఉండగా 11మంది 9.05 గంటల లోపు హాజరయ్యారు. ఇక్కడి హెచ్‌ఎం ఎంఈవోగా ఉండగా, ఒక ఉపాధ్యాయుడు లీవ్‌లో ఉన్నారు.
- సారంగపూర్ మండలం జామ్ ప్రాథమిక పాఠశాలను పరిశీలించగా, ఇక్కడ మొత్తం ఆరుగురు ఉపాధ్యాయులకు ఒకరు లీవ్‌లో ఉన్నారు. మిగితా ఐదుగురు సమయానికి హాజరయ్యారు.
- భైంసా పట్టణంలో పిప్రికాలనీ ప్రాథమిక పాఠశాలను పరిశీలించగా, మొత్తం ముగ్గురు ఉపాధ్యాయులూ సమయానికి వచ్చారు. లైవ్‌లొకేషన్‌ను నమోదు చేశారు.
- దిలావర్‌పూర్ మండలం మాడేగాం ప్రాథమిక పాఠశాలను పరిశీలించగా ఇక్కడ ఉన్న ఒక్క ఉపాధ్యాయుడు 5 నిమిషాలు ఆలస్యంగా వచ్చాడు. అప్పటికే విద్యార్థులు ప్రార్థనకు సిద్ధమయ్యారు.
- లోకేశ్వరం మండలం పంచగుడి ప్రాథమిక పాఠశాలను విజిట్ చేయగా, ఇద్దరు ఉపాధ్యాయులకుగానూ ఒకరు లీవ్‌లో ఉండగా, మరొకరు సమయానికి హాజరై ప్రార్థన చేయించారు.
- భైంసా మండలం మహాగాం ప్రాథమిక పాఠశాల, ముధోల్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు సమయానికే హాజరై ప్రార్థన చేయించారు.
- నర్సాపూర్(జి) ప్రభుత్వ ఉన్నతపాఠశాలను విజిట్ చేయగా, మొత్తం విద్యార్థులు 410 ఉండగా, 27 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. ఒకరు మాత్రమే లీవ్ ఉండగా, 26 మంది ప్రార్థన సమయానికి హాజరయ్యారు.
- ఖానాపూర్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను విజిట్ చేయగా, ఇక్కడ మొత్తం 14 మంది ఉపాధ్యాయులకు 11 మంది హాజరయ్యారు. ఇద్దరు సెలవుల్లో ఉండగా, ఒకరు డీఈవో కార్యాలయానికి పనిపై వెళ్లినట్లు చెప్పారు.

మీ పిల్లలను ఇలాగే చూసుకుంటారా?

- కేజీబీవీ సిబ్బందిని ప్రశ్నించిన రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్
- ఆకస్మికంగా తనిఖీ.. అపరిశుభ్రతపై ఆగ్రహం
- విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్న నేరెళ్ల శారద



విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకుంటున్న మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద

నిర్మల్ రూరల్: 'మీ పిల్లలను ఇలాగే చూసుకుంటారా.. ఇలాగే మాట్లాడతారా.. తల్లిదండ్రులకు దూరంగా హాస్టల్‌లో ఉంటున్న ఆడపిల్లలను సొంత పిల్లల్లా చూసుకోవాలి' అని మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద అన్నారు. సోఫీనగర్‌లో ఉన్న నిర్మల్, సోన్ కేజీబీవీలను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులు, వంట శాలలు, మరుగుదొడ్లు పరిశీలించారు. సోన్ కేజీబీవీ విద్యార్థులతో వ్యక్తిగతంగా మాట్లాడారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ సమస్యలను ఉపాధ్యాయులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తరగతి గదిలో 20 రోజులుగా ఫ్యాన్లు పనిచేయడం తెలిపారు. విద్యాసంవత్సరం ప్రారంభమై మూడు నెలలు గడిచినా రెండు సబ్జెక్టులకు ఉపాధ్యాయులు లేరని విద్యార్థులు తెలిపారు. అనంతరం వంట శాలలో నిల్వ ఉన్న బియ్యంలో పురుగులు, అపరిశుభ్రమైన వాతావరణం చూసి ఎస్‌వోపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఉపాధ్యాయులను నియమించాలని, విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డీఈవో రవీందర్‌రెడ్డిని ఆదేశించారు. అనంతరం విద్యార్థులకు తమ సమస్యలపై మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేయాల్సిన నంబర్లను బోర్డుపై రాశారు. విద్యార్థినులతో అమర్యాదగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఉపాధ్యాయును హెచ్చరించారు. వంట సరుకులు, భోజనం నాణ్యతపై సూచనలు చేశారు. నిర్మల్ కేజీబీవీలో 9వ తరగతి చదివే విద్యార్థిని అస్వస్థతకు గురికావడంతో చలించిన చైర్‌పర్సన్ వెంటనే మెరుగైన వైద్యం అందించాలని డీసీసీ అధ్యక్షుడు కుచాడి శ్రీహరిరావుకు సూచించారు.

దివ్యాంగుల శాఖను వేరుచేయాలి

నిర్మల్‌చైన్‌గేట్: మహిళా శిశు సంక్షేమ శాఖ నుంచి దివ్యాంగుల శాఖను వేరుచేయాలని దివ్యాంగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాకెపెల్లి సురేందర్ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారదను కోరారు. ఈమేరకు డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందించారు. గత ప్రభుత్వం దివ్యాంగుల శాఖను మహిళా శిశు సంక్షేమ శాఖలో విలీనం చేయడంతో తమకు నిధులు కేటాయించడం లేదని తెలిపారు. ఆయన వెంట జిల్లా అధ్యక్షులు ఇసాక్‌అలీ, మాజీ వైస్ ఎంపీపీ నరేశ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి ఉన్నారు.

ఉత్కంఠగా ఏఎంసీ మడిగెల వేలం..!



మాట్లాడుతున్న మార్కెటింగ్ జేడీ శ్రీనివాస్

భైంసాటౌన్: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీకి చెందిన 18 దుకాణాలకు నిర్వహించిన వేలం ప్రక్రియ ఉత్కంఠగా సాగింది. శనివారం ఉదయం 11 గంటలకు ప్రక్రియ ప్రారంభం కాగా, దరఖాస్తుదారులు భారీగా తరలివచ్చారు. కాగా, వేలం విధి విధానాలపై దరఖాస్తుదారులకు, ఏఎంసీ అధికారులకు తీవ్ర వాగ్వాదం జరిగింది. మొదట ఈ-ఆక్షన్ విధానంలో వేలం నిర్వహిస్తామన్న అధికారులు, ఆపై లక్కీడ్రా ద్వారా నిర్వహిస్తామని ప్రకటించడంతో కొందరు వ్యతిరేకించారు. దాదాపు రెండు గంటలపాటు గందరగోళం నెలకొంది. దీంతో అధికారులు కొద్దిసేపు వేలం నిలిపేశారు. విధి విధానాల విషయమై దరఖాస్తుదారులు అధికారులను నిలదీయడంతో వారు పలుమార్లు కార్యాలయంలోకి వెళ్లి చర్చించుకున్నారు. అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభిస్తామని చెప్పి సాయంత్రం 4 గంటలకు మార్కెటింగ్ జేడీ శ్రీనివాస్ సమక్షంలో ప్రారంభించారు. ఈ-ఆక్షన్ స్థానంలో బహిరంగ వేలం ప్రక్రియ నిర్వహించారు. దరఖాస్తుదారులు పోటాపోటీగా మడిగెలను అధిక ధరలకు అద్దె కింద దక్కించుకున్నారు. అనంతరం వేలంలో దుకాణాలు దక్కించుకున్న వారితో ఒప్పందం చేసుకున్నారు. కార్యక్రమంలో మార్కెటింగ్ ఏడీ శ్రీనివాస్, ఏఎంసీ ఉన్నత శ్రేణి కార్యదర్శి పురియా, సెక్రెటరీ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆమే నిర్ణేత!



- గ్రామపంచాయతీల్లో మహిళా ఓటర్లే ఎక్కువ
- మొత్తం ఓటర్లు 4,40,651మంది
- తుది జాబితా విడుదల చేసిన అధికారులు

మొత్తం మండలాలు 18
మొత్తం జీపీలు 400
మొత్తం వార్డులు 3,368
మొత్తం ఓటర్లు 4,40,651
మహిళా ఓటర్లు 2,30,641
పురుష ఓటర్లు 2,09,994
ఇతర ఓటర్లు 16

నిర్మల్‌చైన్‌గేట్: గ్రామపంచాయతీ ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పంచాయతీల వారీగా అధికారులు ఓటరు జాబితా సిద్ధం చేశారు. ఈనెల 13న ముసాయిదా ఓటరు జాబితాను విడుదల చేసిన అధికారులు అభ్యంతరాలుంటే రాతపూర్వకంగా తెలియజేయాలని సూచించారు. ఈనెల 21వ తేదీ వరకు వచ్చిన అభ్యంతరాలను పరిశీలించేందుకు బీఎల్వోలు, రెవెన్యూ బృందాలను గ్రామాలకు పంపించింది. పోలింగ్ స్టేషన్ల మార్పిడి, మృతిచెందిన వారు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారి పేర్లు జాబితా నుంచి తొలగించడం, అర్హులందరికీ ఓటు హక్కు కల్పించే దిశగా చర్యలు ప్రారంభించారు. ఈకసరత్తు గురువారంతో ముగియగా.. శనివారం తుది ఓటరు జాబితాను అధికారులు విడుదల చేశారు. ఈ జాబితా ఆధారంగానే రానున్న గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ ఉంటుందని అధికారులు తెలిపారు.

అన్ని గ్రామాల్లో మహిళలే ఎక్కువ

జిల్లాలోని 18 మండలాల్లో 400 గ్రామపంచాయతీలు ఉన్నాయి. తాజా జాబితా ప్రకారం అన్ని మండలాల్లో మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. మొత్తం 4,40,651 మంది ఓటర్లు ఉండగా, పురుషులతో పోలిస్తే మహిళలు 20,647 మంది ఎక్కువగా ఉన్నారు. ఇక ఇతరులు 16 మంది ఉన్నారు.

1,101 అభ్యంతరాలు..

ఈనెల 14వ తేదీ నుంచి 21 వరకు ముసాయిదా ఓటరు జాబితాపై 1,101 అభ్యంతరాలు వచ్చాయి. వీటిని పరిశీలించి పరిష్కరించిన అధికారులు 26వ తేదీన జిల్లా పంచాయతీ అధికారికి పంపించారు. గత ముసాయిదా కమిటీలో ప్రకటించిన ఓటరు జాబితా కంటే తుది జాబితాలో 392 ఓట్లు తగ్గాయి.

మండలాల వారీగా ఓటర్ల వివరాలు..

మండలం	జీపీల సంఖ్య	వార్డులు	మహిళలు	పురుషులు	ఇతరులు
బాసర	10	90	7,427	7,956	1
భైంసా	30	258	15,970	17,269	2
దస్తురాబాద్	13	102	6,206	6,566	1
దిలావర్‌పూర్	12	108	8,574	9,866	0
కడెం	29	242	13739	14761	1
ఖానాపూర్	25	192	11106	11948	0
కుభీర్	42	344	19,430	20,300	1
కుంటాల	15	134	9,112	9,726	0
లక్ష్మణచాంద	18	162	11,125	12,907	1
లోకేశ్వరం	25	224	13,496	15,470	3
మామడ	27	22	12,067	13,685	0
ముధోల్	19	166	13,514	14,530	2
నర్సాపూర్(జి)	13	120	9,298	10,413	1
నిర్మల్ రూరల్	20	170	10,343	11,865	0
పెంబి	24	152	5,264	5,581	0
సారంగపూర్	32	282	17,917	20,582	2
సోన్	14	132	10,062	11,488	0
తానూర్	32	268	15,344	15,726	0

జోనల్‌స్థాయి పోటీలకు జిల్లా విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు



విద్యార్థికి బహుమతి అందిస్తున్న ప్రిన్సిపాల్ రాజు

సారంగపూర్: ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించే జోనల్‌స్థాయి ఆటల పోటీలకు జిల్లా నుంచి పలువురు విద్యార్థులు ఎంపికయ్యారు. వివిధ క్రీడా పోటీల్లో జిల్లాస్థాయిలో ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. సారంగాపూర్ మండలం చించోలి(బి)మైనారిటీ గురుకుల పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు జోనల్ స్థాయి ఆటల పోటీలకు ఎంపికయ్యారని గురుకులం ప్రిన్సిపాల్ ప్రకాశ్ తెలిపారు. స్కూల్ ఫెడరేషన్ వారి ఆధ్వర్యంలో దిలావర్‌పూర్ మండలం గుండంపల్లి గ్రామంలో శనివారం నిర్వహించిన అండర్ 17 జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల్లో పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి సురేంద్ర ప్రతిభ కనబర్చగా, ఇదే పాఠశాలకు చెందిన పదోతరగతి విద్యార్థులు సాయిరాం, జశ్వంత్ హ్యాండ్‌బాల్ అండర్ 17విభాగంలో ప్రతిభను కనబర్చి జోనల్ స్థాయికి ఎంపికయ్యారని వివరించారు. ఆటల పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను పీఈటీ రిజ్వాన్, ఉపాధ్యాయులు అభినందించారు.

లక్ష్మణచాంద మండలం నుంచి..

లక్ష్మణచాంద: మండలంలోని రాచాపూర్ మహాత్మ జ్యోతి బాపూలే పాఠశాలకు విద్యార్థులు జోనల్ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారు. అండర్ 17 విభాగంలో పదో తరగతి విద్యార్థి జి.గోవర్ధన్ అర్హత సాధించాడు. ప్రిన్సిపాల్ కె.రాజు, పీఈటీ సంతోష్, ఫిజికల్ డైరెక్టర్ దేవేందర్, ఉపాధ్యాయ బృందం అభినందించింది.


కడెం పాఠశాల విద్యార్థిని..



దుమ్మని భార్గవి

కడెం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని దుమ్మని భార్గవి వాలీబాల్ అండర్-17 విభాగంలో జోనల్ స్థాయి పోటీలకు ఎంపికైందని హెచ్‌ఎం ఎం.శ్రీనివాస్‌రెడ్డి, పీడీ బి.వెంకటరమణ తెలిపారు. ఈనెల 27న, గుండంపల్లి ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో భార్గవి ప్రతిభ కనబర్చి జోనల్‌స్థాయికి ఎంపికైనట్లు పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ అన్నారు. ఈమేరకు కలెక్టరేట్ ఎదుట శనివారం ధర్నా నిర్వహించి ఏవోకు వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాసర ట్రిపుల్‌ఐటీ హౌస్ కీపింగ్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న జీతాలు విడుదల చేసి జీవో 60 ప్రకారం వేతనాలు చెల్లించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక, పారిశ్రామిక విధానాలతో అన్నిరంగాల్లో తాత్కాలిక ఉద్యోగుల సంఖ్య పెరిగిందన్నారు. 1991 నుంచి అనుసరిస్తున్న ఈ విధానాలతో ఉద్యోగ భద్రత పోయి హైర్ అండ్ ఫైర్ సిస్టమ్ వచ్చిందన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసం కార్మిక చట్టాల్లో మార్పు చేశారన్నారు. 29 చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్‌లు తీసుకొచ్చిందన్నారు. 8 గంటల పని విధానాన్ని 12 గంటలు చేసిందని పేర్కొన్నారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, క్యాజువల్ విధానాలలో టెంపరరీ, డైలీ వేజ్, అప్రెంటీస్, పీస్ రేటెడ్, హోమ్ బేస్డ్ వర్కర్స్ పేరుతో వెట్టిచాకిరీ చేయించుకుంటున్నారని విమర్శించారు. బాసర ట్రిపుల్‌ఐటీ యూనియన్ అధ్యక్షుడు ఫిరాజి, కార్యదర్శి సాయిలు, రేంజర్ల భారతి, సాయిబాబా,లింగన్న, సిద్ధు, గంగన్న, ఆకాశ్, సాయి, రవి పాల్గొన్నారు.

క్లుప్తంగా

గంజాయి మొక్కలు పట్టివేత



మొక్కలు స్వాధీనం చేసుకుంటున్న సీఐ

ఇచ్చోడ: మండలంలోని గుబ్బ గ్రామంలో పత్తి పంటలో సాగు చేస్తున్న గంజాయి మొక్కలను పక్కా సమాచారంతో సీఐ భీమేశ్ ఆధ్వర్యంలో శనివారం పట్టుకున్నారు. సీఐ కథనం ప్రకారం..కోవ హనుమంత్‌కు చెందిన వ్యవసాయ భూమిని అదే గ్రామానికి చెందిన పెందుర్ మానిక్యరావు కౌలు తీసుకుని సాగు చేస్తున్నాడు. పత్తిలో అంతర పంటగా గంజాయి సాగు చేస్తున్న 30 మొక్కలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. వీటి విలువ రూ.45 వేలు ఉంటుందన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బైక్ దగ్ధం



దగ్ధమైన బైక్

భీమిని: కన్నెపల్లి మండలం నాయకునిపేట పంచాయతీ పరిధిలోని మొక్కంపల్లి (కుర్మగూడెం) గ్రామంలో శనివారం పల్సార్ బైక్ దగ్ధమైంది. పోలీసులు, కుటుంబీకులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన గాదర్ల మహేశ్ తన ఇంటి ముందు షెడ్డులో బైక్ పెట్టాడు. ఒగ్గు కథ చెప్పడానికి చెన్నూర్‌కు వెళ్లాడు. శనివారం మధ్యాహ్నం ఒక్కసారిగా బైక్ నుంచి భారీ శబ్దం వచ్చి మంటలు చెలరేగాయి. దీంతో మహేశ్ తల్లి ప్రేమల బయటికి వచ్చి చూడగా అదే గ్రామానికి చెందిన గాదర్ల రాజేశ్ పరిగెడుతూ కనిపించడం చూసింది. బాధితుడి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గంగారాం తెలిపారు.

యువకుడి బైండోవర్

నెన్నెల: సోషల్ మీడియాలో సీఎం రేవంత్ రెడ్డి, బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్‌పై అభ్యంతకర పోస్టుపెట్టిన ఓ వ్యక్తిని సోమవారం తహసీల్దార్ సబ్బ రమేశ్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. మండలంలోని కొత్తూర్‌కు చెందిన యువకుడు తలండి నాగేశ్ ఇటీవల సీఎం, ఎమ్మెల్యేలపై అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు మహ్మద్ జలీల్ ఫిర్యాదు మేరకు బైండోవర్ చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. సోషల్ మీడియాలో ఎవరైనా రెచ్చగొట్టేలా పోస్టులు పెడితే చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

లాఠీ ఎత్తారు..!

- మంచిర్యాల పోలీస్‌స్టేషన్ సాక్షిగా ఇరువర్గాల దాడి
- ఈనెల 23న ఘటన
- వరుస దాడులతో జనం బెంబేలు



గతేడాది సెప్టెంబర్‌లో బైపాస్‌రోడ్‌లోని జగన్‌మోహన్‌రావు ఇంటి వద్ద దాడులు చేస్తున్న ఓ వర్గం

మంచిర్యాలక్రైం: ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం అమలుతో పోలీసులు పెద్దగా లాఠీలకు పని చెప్పినా దాఖలాలు లేవు. చాలాకాలం తర్వాత ఖాకీలు లాఠీలకు పనిచెప్పినా వీడియో వైరల్ అయింది. జిల్లాకేంద్రంలో ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. బైపాస్ రోడ్‌లో ఈనెల 23న అర్ధరాత్రి కాంగ్రెస్ నాయకుడు జగన్‌మోహన్‌రావు వద్ద పనిచేసే మేర సంజీవ్‌పై జరిగిన దాడి కేసులో పోలీసులు కొందరిని స్టేషన్‌కు పిలిపించినట్లు సమాచారం. కేసులో సంబంధం లేని వ్యక్తులను పిలవడంతో ఓ వర్గానికి చెందిన వారు అక్కడికి వెళ్లారు. మరో వర్గానికి చెందిన వారు అక్కడే ఉన్నారు. స్టేషన్ సాక్షిగా రెండువర్గాల మధ్య మాటామాట పెరిగి పరస్పరం దాడులు చేసుకున్నారు. పోలీసులు వారిపై లాఠీ ఝుళిపించారని తెలిసింది.

వరుస దాడులు..

జిల్లాలో వరుసగా గ్యాంగ్‌లు, ఇరువర్గాలు పరస్పరం దాడులతో పట్టణ ప్రజలు బెంబేలెత్తుతున్నారు. స్టేషన్‌కు వచ్చిన యువకులపై లాఠీ ఝులిపించడం, గొడవలు జరుగుతుంటే శాంతిభద్రతలు పరిరక్షణలో పోలీసులు విఫలమవుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫ్రెండ్లీ పోలీసింగ్ కాస్త..మంచిర్యాల పోలీసుల తీరుతో 'పోకిరి'పోలీసింగ్ విధానంగా మారిందనే విమర్శలున్నాయి. 2022 జిల్లా కేంద్రంలో ఎల్‌ఐసీ కాలనీలో ప్రారంభమైన గ్యాంగ్ దాడి మొదలుకొని వరుస దాడులు ప్రస్తుతం పోలీస్‌స్టేషన్ వరకు చేరుకోవడం, ఈ దాడుల్లో ఖాకీలు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి.

- జిల్లాకేంద్రంలో ఇప్పటికే గ్యాంగ్ లీడర్ల మధ్య ఆధిపత్య పోరు సాగుతోంది. ఓ వర్గానికి రాజకీయ, పోలీసుల బలం మెండుగా ఉన్నట్లు సమాచారం. రెండు వర్గాల మధ్య ఆధిపత్య పోరును అరికట్టడంలో విఫలమవుతున్నారనే ఆరోపణలున్నాయి. రాజకీయ బలం, ధన భలం ఉన్నవారికే పోలీస్ యంత్రాంగం ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి.
- 2022, మే నెలలో ఎల్‌ఐసీ కాలనీలో ఓ భూవివాదంలో ఇంటి నిర్మాణం తొలగించడానికి ఓ ముఠా వీరంగం సృష్టించింది. 10 మంది మద్యం తాగి క్రికెట్ బ్యాట్లు, గడ్డపార పట్టుకుని హల్‌చల్ చేశారు. స్థానికులు 100 డయల్‌కు ఫోన్ చేయడంతోపోలీసులు వచ్చేసరికి పారిపోయారు.
- అదేనెలలో శ్రీరాంపూర్ బస్టాండ్ వద్ద రెండు వర్గాల మధ్యం జరిగిన దాడిలో ఒకరు తీవ్ర గాయలపాలై చికిత్స పొందుతూ మృతి చెందాడు. అప్పటి నుంచి వరుసగా గ్యాంగ్‌లీడర్ల ఆరాచకాలు రోజురోజుకు పెట్రేగిపోతున్నాయి. ఏకంగా పోలీస్‌స్టేషన్ వరకు చేరుకుందంటే జిల్లాలో శాంతి భద్రతలు ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.
- గతేడాది సెప్టెంబర్‌లో జిల్లా కేంద్రంలో గణేజ్ నిమజ్జనం రోజున మద్యం మత్తులో రెండు వర్గాల మధ్య గొడవ పెద్దదిగా మారింది. బైపాస్ రోడ్‌లోని జగన్‌మోహన్‌రావు ఇంటిపై క్రికెట్ బ్యాట్లు, ఇనుప రాడ్లతో రెండు వర్గాలు దాడులు చేసుకుని బీభత్సం సృష్టించాయి.
- 2024 మే 14న ఐబీ చౌరస్తా సమీపంలో మా విందు హోటల్ ఎదుట రెండు వర్గాల దాడుల్లో ఇరువురికి గాయాలయ్యాయి. సీసీ ఫుటేజీ ఆధారంగా పలువురిపై కేసులు నమోదైంది.
- గత జూన్ 2న బీఆర్ఎస్ యువ నాయకుడు గడప రాకేశ్‌పై ఓ వర్గానికి చెందిన గ్యాంగ్ దాడి చేసింది. దాడిచేసిన వారిపై కేసులు గుట్టుచప్పుడు కాకుండా కేసు నమోదు చేశారు.
- ఈనెల 23న బైపాస్ రోడ్‌లో కాంగ్రెస్ నాయకుడు జగన్‌మోహన్‌రావు ఇంటి వద్ద మేర సంజీవ్‌పై బీఆర్ఎస్ యువనాయకుడు గడప రాకేశ్ అనుచరులు దాడికి పాల్పడ్డారు. ఆత్మరక్షణ కోసం సంజీవ్ ఎదురు దాడి చేయగా ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి.
- ఈనెల 25న పోలీస్‌స్టేషన్ ఆవరణలో రెండు వర్గాలు దాడి చేసుకున్నాయి. పోలీసుల లాఠీ ఛార్జ్ చేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ప్రస్తుతం చర్చనీయాంశమైంది.

చర్యలు తీసుకుంటాం



జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కల్గిసే చర్యలు తీసుకుంటాం. రెండువర్గాల మధ్య దాడులు, ఉనికి చాటుకునేందుకు ఒకరిపై ఒకరు దాడులకు పాల్పడుతున్నారు. రాజకీయాలకతీతంగా కేసులు నమోదు చేయడంతోపాటు రౌడీషీట్, పీడీయాక్టు నమోదు చేస్తాం. ఈనెల 25న పోలీస్‌స్టేషన్ లోపల రెండువర్గాలు దాడి చేసుకున్న విషయం నా దృష్టికి రాలేదు.

– ఎగ్గడి భాస్కర్, డీసీపీ, మంచిర్యాల

వివాహితపై లైంగికదాడికి పాల్పడిన వ్యక్తి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

కుభీర్: వివాహితపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు భైంసా రూరల్ సీఐ నైలు తెలిపారు. కుభీర్ పోలీసుస్టేషన్‌లో శనివారం ఈ మేరకు వివరాలు వెల్లడించారు. మండలంలోని దోడర్నా గ్రామానికి జాదవ్ సాహెబ్రావ్ గత ఆరునెలలుగా లైంగిక వాంఛ తీర్చాలని ఓ వివాహితను వేధించాడు. ఈ విషయం తెలియడంతో ఆమె భర్త అతన్ని హెచ్చరించాడు. ఈనెల 26న వివాహిత ఇంట్లో ఎవరూ లేని సమయంలో జాదవ్ సాహెబ్రావ్ ఆమెపై లైంగికదాడి చేసి ఆమె ఫోన్‌ను ఎత్తుకెళ్లాడు. బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు రెండు బృందాలు ఏర్పాటు చేసి నిందితుడిని పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. అతని వద్ద నుంచి రెండు ఫోన్లు, నిందితుడి బట్టలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. నిందితుడిని పట్టుకున్న ఎస్సై పి.రవీందర్, పోలీసులను ఎస్పీ జానకీ షర్మిల అభినందించారు.

బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ



బ్రాంచ్ మెడల్ సాధించిన అనన్య

మంచిర్యాలటౌన్: సికింద్రాబాద్‌లో శనివారం జరిగిన పీఎన్‌బీ మెట్‌లైఫ్ జేబీసీ తెలంగాణ స్థాయి ఓపెన్ టోర్నమెంట్‌లో అండర్–17 విభాగంలో మంచిర్యాల బ్యాడ్మింటన్ క్రీడాకారిణి అనన్య సెమీఫైనల్‌కు చేరి తృతీయస్థానంలో నిలిచినట్లు ఉమ్మడి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి సుధాకర్ ఓ ప్రకటనలో తెలిపారు. బ్రాంచ్ మెడల్‌ను సాధించిన అనన్య జాతీయస్థాయి జేబీసీ టోర్నమెంట్‌కు అర్హత సాధించగా, ఆమెతోపాటు కోచ్ నరేందర్‌ను అసోసియేషన్ చైర్మన్ గాజుల ముఖేశ్‌గౌడ్, ఉపాధ్యక్షుడు భాస్కర్ల వాసు, బండ మీనారెడ్డి, ట్రెజరర్ సత్యపాల్ రెడ్డి, జాయింట్ సెక్రటరీలు రమేశ్‌రెడ్డి, మధు అభినందించారు.

అరచేతిలో భగత్‌సింగ్ ముఖచిత్రం



తాంసి: మండలంలోని పొన్నారి గ్రామానికి చెందిన యువకుడు గట్టు రాజు తన అరచేతిపై వినూత్నంగా భగత్‌సింగ్ ముఖచిత్రాన్ని వేసుకుని అబ్బురపరిచాడు. శనివారం భగత్‌సింగ్ జయంతి సందర్భంగా ఆయనపై ఉన్న అభిమానంతో అరచేతిలో భగత్‌సింగ్ ముఖ చిత్రాన్ని వేసుకుని ఇలా నివాళిర్పించాడు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



వృద్ధుల చట్టాలను వివరిస్తున్న రిటైర్డ్ జడ్జి

మంచిర్యాలటౌన్: వృద్ధుల కోసం ఉన్న చట్టాలపై అవగాహన పెంచుకోవాలని రిటైర్డ్ జడ్జి కె.రాజన్న అన్నారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవంలో భాగంగా జిల్లా కేంద్రంలోని వృద్ధుల డే కేర్ సెంటర్, రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ అసోసియేషన్ కార్యాలయంలో శనివారం జిల్లా మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యాన వృద్ధులకు చట్టాలపై అవగాహన కల్పించారు. రిటైర్డ్ జడ్జి మాట్లాడుతూ 60 ఏళ్లు నిండిన వారు వయోవృద్ధులను కుమారులు, కుమార్తెలు చూసుకోవాల్సిన బాధ్యత ఉంటుందన్నారు. రిటైర్డ్ డిప్యూటీ జీఎం రామస్వామి, రాజమల్లు, అడ్వొకేట్ లచ్చన్న, సందాని, సురేందర్, రెస్పాన్స్ ఆఫీసర్ ఫర్జానా బేగం, డీహెచ్‌ఈడబ్ల్యూ కోఆర్డినేటర్ సౌజన్య పాల్గొన్నారు.

టీచర్ల హేతుబద్ధీకరణ ఉత్తర్వులు సవరించాలి

మంచిర్యాలఅర్బన్: పాఠశాల విద్య–ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణ ఉత్తర్వులు సవరించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) బాధ్యులు కోరారు. శనివారం ఈ మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవో నంబర్ 25ను సవరించిన తర్వాత టీచర్లను సర్దుబాటు చేయాలన్నారు. బదిలీ అయి రిలీవ్ చేయని టీచర్లను వెంటనే రిలీవ్ చేసి పాఠశాలలో సర్దుబాటు చేయాలన్నారు. బదిలీలు, పదోన్నతుల అప్పీళ్లను పరిష్కరించాలన్నారు. బోధనేతర పనులు, పాఠశాల పర్యవేక్షణ నిమిత్తం ప్రతీ ప్రాథమిక పాఠశాలలకు హెచ్‌ఎంలు ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు, తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా చూడాలన్నారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. రాజావేణు, జయకృష్ణ, నాగలక్ష్మి, కిరణ్, కుమారస్వామి, కళావతి, గంగాధర్, అంజనేయులు పాల్గొన్నారు.

వ్యభిచార గృహంపై టాస్క్‌ఫోర్స్ దాడి



పోలీసుల అదుపులో నిందితులు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని సాయికుంటలోని సంతోష్‌నగర్ కాలనీలో వ్యభిచారం గృహంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం దాడి చేశారు. పక్కా అందిన సమాచారంతో సీఐ రాజ్‌కుమార్, ఎస్సై ఉపేందర్ తమ సిబ్బందితో కలిసి కాలనీలోని అద్దె ఇంటిపై దాడి చేశారు. ఇందులో ఒక మహిళతోపాటు సీతారాంపల్లికి చెందిన బోలెం శ్రీకాంత్, నిర్వాహకుడు ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం జక్కులపల్లికి చెందిన తోట మహేందర్‌ను అరెస్టు చేశారు. విచారణ నిమిత్తం వారిని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు సీఐ, ఎస్సై తెలిపారు.

ఆర్‌ఎంపీ రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ నరేందర్

లక్సెట్టిపేట: వైద్యం వికటించి యువకుడి మృతికి కారణమైన దండేపల్లి మండలం కన్నెపల్లికి చెందిన ఆర్‌ఎంపీని శనివారం రిమాండ్ తరలించినట్లు సీఐ నరేందర్, ఎస్సై సతీశ్ తెలిపారు. పోలీసుస్టేషన్‌లో ఈ మేరకు వివరాలు వెల్లడించారు. లక్సెట్టిపేట మండలం కొత్త కొమ్ముగూడెం గ్రామానికి చెందిన బత్తుల మధుకర్ (26)కు జ్వరం వచ్చింది. గ్రామంలో ఆర్‌ఎంపీ బొడ్డు శ్రీనివాస్ అతనికి చికిత్స అందించాడు. మూడు ఇంజక్షన్లు రెండు గ్లూకోజ్‌లో కలిపి సెలైన్ ఎక్కించి వైద్యం చేయడంతో యువకుడికి చలిజ్వరం వచ్చింది. ఆర్‌ఎంపీ అతన్ని మంచిర్యాలలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించాడు. అక్కడ వైద్యులు పరిశీలించి హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి రెఫర్ చేశారు. బ్రెయిన్ డెడ్ తర్వాత కుటుంబీకులు మంచిర్యాలలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకురాగా, చికిత్స పొందుతూ ఈనెల 24న మృతిచెందాడు. ఆర్‌ఎంపీ ఇచ్చిన వైద్యం వికటించి తన కుమారుడు మృతిచెందాడని తండ్రి రాజలింగయ్య ఫిర్యాదుతో కేసు నమోదైనట్లు వారు తెలిపారు.

గేదెలను ఢీకొన్న బైక్.. ఒకరి మృతి



ప్రవీణ్ (ఫైల్)

జైపూర్: మండలంలోని ఇందారం రాజీవ్ రహదారిలో గల రైల్వేబ్రిడ్జిపై గేదెలను బైక్ ఢీకొంది. ఈ ఘటనలో యువకుడు మృతి చెందగా, మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. జైపూర్ సెకండ్ ఎస్సై నాగరాజు కథనం ప్రకారం.. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం పోరండ్ల గ్రామానికి చెందిన సిర్రం ప్రవీణ్ (25), పొన్నం అజయ్ బైక్‌పై శుక్రవారం మంచిర్యాలలోని బంధువుల ఇంటికి వచ్చారు. తిరిగి రాత్రి ఇంటి వెళ్తుండగా గేదెలను వేగంగా ఢీకొట్టడంతో ప్రవీణ్ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన అజయ్‌ను హైదరాబాద్‌కు తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సెకండ్ ఎస్సై తెలిపారు.

ప్రైవేట్ ఆస్పత్రిలో నవజాత శిశువుమృతి



మృతి చెందిన శిశువును తీసుకెళ్తున్న బంధువులు



రోదిస్తున్న బాధితురాలి బంధువులు

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బంధువుల ఆరోపణ

భైంసాటౌన్: పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో నవజాత శిశువు మృతి చెందింది. బాధితుల కథనం ప్రకారం.. కుభీర్ మండలం రాజురా గ్రామానికి చెందిన కొట్టె ఆనందకు నెలలు నిండడంతో గురువారం పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అదేరోజు వైద్యులు పరీక్షించి ప్రసవం చేశారు. దీంతో ఆడ శిశువు జన్మించగా, శనివారం మృతిచెందింది. రెండురోజులు ఆరోగ్యంగా ఉన్న శిశువు వైద్యుల నిర్లక్ష్యంతోనే మృతి చెందిందంటూ బంధువులు ఆరోపించారు. ఈ విషయమై కొద్దిసేపు ఆస్పత్రిలో ఆందోళన నెలకొనడంతో పోలీసులు చేరుకుని సముదాయించారు. అనంతరం మృతశిశువును బంధువులు స్వగ్రామానికి తీసుకెళ్లారు. ఈ విషయమై వైద్యుడు అనిల్‌ను సంప్రదించగా, శిశువుకు పాలు తాపించే క్రమంలో తల్లి అజాగ్రత్త కారణంగా శిశువు మృతి చెందినట్లు పేర్కొన్నారు.

జిల్లాలవారీగా వర్గీకరణ చేయాలి

- మాదిగ జేఏసీ వ్యవస్థాపకుడు పిడమర్తి రవి



మాట్లాడుతున్న పిడమర్తి రవి

ఆదిలాబాద్‌రూరల్: ఎస్సీ వర్గీకరణ జిల్లాలవారీగా చేయాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, మాదిగ జేఏసీ వ్యవస్థాపకుడు డాక్టర్ పిడమర్తి రవి విజ్ఞప్తి చేశారు. శనివారం మాదిగల మేలుకొలుపు యాత్ర పట్టణానికి చేరుకుంది. ఈ సందర్భంగా పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట గల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. ఉమ్మడి 10 జిల్లాల్లో మాదిగల జనాభా నిష్పత్తి ప్రకారం వారి జనాభా ఎంత ఉంటే అంత రిజర్వేషన్ కల్పించాలన్నారు. కొన్ని జిల్లాల్లో మాదిగలు అధికంగా ఉన్నారన్నారు. మంచిర్యాల, పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాల్లో ఈ యాత్ర ఉంటుందన్నారు. జిల్లాలవారీగా వర్గీకరణ చేపట్టేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు అన్ని జిల్లాకేంద్రాల్లో ఈ యాత్ర చేపడుతామన్నారు. అక్టోబర్ 1న భువనగిరిలో ముగింపు సభ ఉంటుందని తెలిపారు. మాదిగ జేఏసీ జిల్లా జిల్లా అధ్యక్షుడు మనోజ్, నాయకులు నక్క రాందాస్, మాదిగ రాజకీయ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఒక్కలగడ్డ సోమ చంద్రశేఖర్, బీఎస్‌ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ బోరెల్లి సురేశ్, మాదిగ జేఏసీ ఓయూ అధ్యక్షులు జోగు గణేశ్, గణేశ్ కథ, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బకాయిలు వెంటనే చెల్లించాలి

- ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య



మాట్లాడుతున్న సీతారామయ్య

శ్రీరాంపూర్: రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి బకాయి ఉన్న రూ. 33 వేల కోట్లను వెంటనే చెల్లించాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య డిమాండ్ చేశారు. శనివారం ఆయన ఆర్కే 6, ఆర్కే 7 గనులపై గేట్ మీటింగ్ నిర్వహించి కార్మికులనుద్దేశించి మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణికి రూ.29 వేల కోట్ల బకాయి పెడితే తాజాగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అదనంగా మరో రూ. 4 వేల కోట్ల బకాయి పెంచిందన్నారు. ఈ బకాయి డబ్బులు సింగరేణి చెల్లిస్తే సంస్థ అభివృద్ధి కార్యక్రమాలకు ఎంతగానో దోహదపడతాయన్నారు. అంతేకాకుండా సింగరేణిలో రాజకీయ జోక్యం పెరిగిందని, ఇది పోవాలన్నారు. సింగరేణి సంస్థకు నష్టం జరిగేలా ప్రభుత్వం గానీ, యాజమాన్యం గానీ ఎలాంటి నిర్ణయం తీసుకున్న కార్మికులు పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ డెప్యూటీ ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచి కార్యదర్శి షేక్ బాజీసైదా, ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్ రావు, కార్యదర్శి సారయ్య నాయకులు గొర్రె నరసయ్య, అఫ్రోజ్ ఖాన్, సంఘం సదానందం, బీర రవీందర్, చంద్రశేఖర్, చిలుక రామచందర్, రేగుల శంకర్, దొడ్డిపట్ల రవీందర్ పాల్గొన్నారు.

పవర్ ప్లాంటులో కార్మికుల ఆందోళన

- ఆత్మహత్య చేసుకున్న కుటుంబాన్ని ఆదుకోవాలి
- రూ.15 లక్షలు, కుటుంబంలో ఇద్దరికి ఉద్యోగాలిస్తామని అధికారుల హామీ



ఆందోళన చేస్తున్న కార్మికులు, నాయకులతో మాట్లాడుతున్న ఎస్సై శ్రీధర్

జైపూర్: జైపూర్ సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటులో కాంట్రాక్టు కార్మికుడిగా విధుల్లోకి తీసుకోవడం లేదని మనస్తాపంతో మాసు బాలకృష్ణ ఆత్మహత్యకు పాల్పడగా బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని హెచ్‌ఎంఎస్, బీఎంఎస్, ఐఎన్‌టీయూసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి పరిహారంతోపాటు కుటుంబంలో ఉద్యోగం కల్పించాలని కార్మికులు, నాయకులు ఎస్టీపీపీ ప్రధాన గేటు వద్ద శనివారం ఆందోళన చేపట్టారు. సంఘాల నాయకులు, బాధిత కుటుంబీకులతో పవర్‌మేక్ కంపెనీ అధికారులు, ఎస్సై శ్రీధర్ సమక్షంలో చర్చలు జరిపారు. పవర్‌మేక్ కంపెనీ నుంచి తక్షణ సాయం రూ.20వేలు అందించడంతోపాటు రూ.15 లక్షల ఆర్థికసాయం, కుటుంబంలో ఇద్దరికి ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు. కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఒప్పందం చేసుకున్నారు. దీంతో కార్మికులు ఆందోళన విరమించజేశారు.

3 నుంచి బాసరలో దసరా వేడుకలు



బాసర సరస్వతి అమ్మవారు

బాసర: బాసర శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారి దేవస్థానంలో అక్టోబర్ 3 నుంచి 12వ తేదీ వరకు దసరా ఉత్సవాలు నిర్వహిస్తామని ఈవో విజయరామారావు తెలిపారు. వేడుకల్లో భాగంగా అమ్మవారిని తొమ్మిది రోజులు తొమ్మిది రూపాల్లో అలంకరిస్తామన్నారు. మొదటిరోజు శైలపుత్రిగా, రెండో రోజు బ్రహ్మచారిణిగా, మూడవరోజు చంద్రఘంటా అలంకరణలో, నాలుగోరోజు కూష్మాండ అలంకరణ, ఐదోరోజు స్కదమాతగా, ఆరోరోజు కాత్యాయనిగా, ఏడో రోజు కాళరాత్రిగా, ఎనిమిదో రోజు మహాగౌరీగా, తొమ్మిదోజు సిద్ధిధాత్రిగా అమ్మవారు దర్శనమిస్తారని వివరించారు. నవరాత్రుల సందర్భంగా బాసరకు వచ్చే భక్తులకు ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. వేడుకలకు రావాలని ఇప్పటికే మంత్రులకు, ఎమ్మెల్యేలకు, ఆయా శాఖల ఉన్నతాధికారులకు ఆహ్వానం అందించినట్లు తెలిపారు.

ఐటీడీఏ ఉద్యాన నర్సరీ సందర్శన



నర్సరీని పరిశీలిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలో ఐటీడీఏ ఆధ్వర్యంలో ఉద్యాన నర్సరీ, శిక్షణ కేంద్రాన్ని నిజామాబాద్ జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ (ట్రెయినీ) అజ్మీర సంకేత్ శనివారం సందర్శించారు. నర్సరీలో మొక్కల రక్షణకు తీసుకుంటున్న చర్యలను గురించి ఐటీడీఏ ప్రాజెక్టు ఉద్యాన అధికారి సందీప్‌కుమార్‌ని అడిగి తెలుసుకున్నారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా సాగు చేస్తున్న పసుపు, టమాట, వరి, జామ తోటలను పరిశీలించారు. హెచ్‌ఎం సుదీర్‌కుమార్, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, నర్సరీ టెక్నికల్ అస్టింట్ అర్షిత ఉన్నారు.

అంతర్జాతీయ పోటీల్లో రామకృష్ణ ప్రతిభ

మందమర్రిరూరల్: సౌత్ అమెరికాలోని కొలంబియాలో ఈనెల 15 నుంచి 20 వరకు అంతర్జాతీయ మైన్స్ రెస్క్యూ పోటీలు నిర్వహించారు. ఇందులో పట్టణానికి చెందిన రామకృష్ణ డబ్ల్యూపీఎస్ తరఫున రెస్క్యూ టీమ్ ద్వారా వైస్ కెప్టెన్‌గా పాల్గొన్నాడు. 8 దేశాల నుంచి 21 జట్లు పాల్గొనగా, రామకృష్ణ జట్టు ఓవరాల్‌గా ద్వితీయ స్థానం సాధించింది. కేకే–5 గనిలో సీనియర్ మైనింగ్ సర్దార్‌గా విధులు నిర్వహిస్తున్న బొల్లపల్లి తిరుపతి–విజయలక్ష్మి దంపతుల కుమారుడు రామకృష్ణ శనివారం మొదటి సారిగా ఇక్కడకు వచ్చాడు. తల్లిదండ్రులు అతన్ని ఓపెన్‌టాప్ వాహనంలో బ్యాండ్ మేళాల మధ్య ఊరేగింపుగా ఇంటికి తీసుకెళ్లారు. కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.